క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్‌: నగరంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు 1వ డివిజన్‌లోని అగ్రహారం, తర్వాత 2వ డివిజన్‌ మురకంబట్టు, 50వ డివిజన్‌లోని చవటపల్లె, 3వ డివిజన్‌ దొడ్డిపల్లెలో సమావేశం ఉంటుందన్నారు. డివిజన్‌ వాసులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని వివరించారు.

వాహనదారుల అవస్థలు



బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

పూతలపట్టు(యాదమరి): రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పి.కొత్తకోట దగ్గర పాకాల–పేటమిట్ట మార్గంలో కొద్దినెలల క్రితం రైల్వే అండర్‌ బ్రిడ్జి నిర్మించారు. అయితే చిన్నపాటి వర్షానికే బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరి నిల్వ ఉంటోంది. దీంతో ఆ బ్రిడ్జి మీదుగా వెళ్లే పరిసర గ్రామ ప్రజలు వర్షం వస్తే బెంబేలెత్తుతున్నారు. బ్రిడ్జి కింద వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలోకి వర్షపు నీరు చేరడంతో పాడవుతున్నాయి. కార్లు సైతం ఆ నీటిలో నిలిచిపోవడంతో ఇతర వాహనాలు వెళ్లడానికి వీలులేక ట్రాఫిక్‌ ఏర్పడుతోంది. భారీ క్రేన్ల సాయంతోనే కార్లను బయటకు తీయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు కార్ల యజమానులు వాపోతున్నారు. వర్షం వస్తే ఈ మార్గంలో వెళ్లాలంటే భయం వేస్తోందని ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి ఇలా వర్షపు నీరు నిల్వ ఉండడంతో పనులకు వెళ్లలేక ఇంటిపట్టునే ఉంటున్నామని తెలిపారు. ఈ మార్గం తప్ప వేరే దారి లేదని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనదారుల ఇక్కట్లను తొలగించాలని సమీప గ్రామ ప్రజలు కోరుతున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



రాతి కూసాల వైపు వాలిన బస్సు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. శనివారం చిత్తూరు నుంచి నల్లవెంకటయ్యగారిపల్లి వైపు వస్తున్న బస్సుకు సిద్ధంపల్లి వద్ద ఓ ట్రాక్టర్‌ ఎదురువచ్చింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌ అతివేగంగా బస్సుపైకి దూసుకు రావడంతో ఆర్టీసీ బస్సు ఓ పక్కకు ఒరిగింది. చాకచక్యంగా డ్రైవర్‌ బస్సును రాతి కూసాలకు తగలకుండా నిలిపాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగ లేదు. రోడ్డు కిందకు ఒరిగిన బస్సును పైకి తీసుకొచ్చేందుకు డ్రైవర్‌ కాస్త కష్టపడాల్సి వచ్చింది.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలి



సీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

తవణంపల్లె: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక హైస్కూల్‌ హెచ్‌ఎం, సీఆర్‌సీ సెక్రటరీ వేణుగోపాల్‌ రెడ్డి తెలిపారు. శనివారం తవణంపల్లె హైస్కూల్లో సీఆర్‌సీ సమావేశం జరిగింది. సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడు లేదా నాలుగో శనివారం విధిగా సీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు చేయించాలని, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం

రాత్రైతే చాలు గుట్టుచప్పుడు కాకుండా కొందరు అక్రమార్కులు పెద్ద పెద్ద చెట్లను నరికి కలపగా మార్చి అక్రమంగా తరలించేస్తూ లక్షలు గడిస్తున్నారు. ఈ అక్రమార్కులు కొందరు అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి పగలూ రాత్రీ తేడా లేకుండా యథేచ్ఛగా పచ్చదనాన్ని కొల్లగొడుతున్నారు. ఈ అక్రమ కలప దందా జనం చూస్తుండగానే.. ప్రభుత్వ కార్యాలయాల ఎదుటే తరలిస్తున్నా.. అడ్డుకునే వారు లేరు.

- రైతుల పొలాల గట్లపై మాయమవుతున్న ఏళ్ల నాటి వృక్షాలు
- యాదమరిలో యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- పగలూ రాత్రి తేడా లేకుండా సరిహద్దులు దాటుతున్న సరుకు
- కలప వ్యాపారుల నుంచి అటవీ, స్థానిక అధికారులకు ముడుపులు
- పచ్చదనానికి పాతరేస్తున్నా.. నియంత్రించని వైనం



పట్టపగలే యాదమరి బస్టాప్‌ మీదుగా అక్రమంగా తరలుతున్న కలప



రాత్రి సమయంలో పక్క రాష్ట్రానికి తరలిస్తున్న కలప

యాదమరి: మండల పరిధిలోని గ్రామాల్లో ఏళ్ల నాటి వృక్షాలు నేలకొరుగుతున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న కొందరు రైతులను మధ్యవర్తుల ద్వారా కలప వ్యాపారులు కలుసుకుని మాయమాటలు చెప్పి తమ పొలాల పరిధిలో ఉన్నటువంటి భారీ వృక్షాలను కొనుగోలు చేస్తామని బేరాలు ఆడతారు. పెద్దమొత్తంలో చెల్లిస్తామని చెప్పి ప్రలోభాలకు గురి చేస్తారు. ఆపై కొందరు రైతులు తమ భూమిలోని చెట్లను వారికి అమ్మడానికి సమ్మతించడంతో ఒకటికి నాలుగు చెట్లను నరికేస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం చెట్లను నరకాలంటే నిర్దేశిత కారణాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ కొందరు అనుమతులను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా నరికేసి జేబులు నింపుకుంటున్నారు. ఈ అక్రమ వ్యాపారంపై కొందరు గ్రామస్తులు సంబంధిత ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించినా నిర్లక్ష్యంగా ఉంటున్నారని పలు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వారి అలసత్వాన్ని అలుసుగా తీసుకుని కొందరు అక్రమార్కులు నిత్యం భారీ చెట్లను నరికేసి కలపగా మార్చి భారీగానే సొమ్ము చేసుకుంటున్నారు.

పచ్చదనాన్ని కాపాడాలంటూ కథలు చెప్తూ..

ప్రభుత్వ అధికారులు మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని ఉపన్యాసాలు ఇస్తారు. కానీ దాన్ని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతారు. మండలంలో చాలా రోజులుగా కలప దందా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు ఏమీ ఎరుగనట్లు ఉంటున్నారు. ఎక్కడైనా అక్రమార్కులు తమ చీకటి వ్యాపారాన్ని రాత్రి సమయంలో చేసుకుంరు. కానీ యాదమరిలో మాత్రం పగలూ రాత్రి తేడా లేకుండా యాదమరి–గుడియాత్తం ప్రధాన రహదారి గుండా పదుల సంఖ్యలో విలువైన వృక్ష సంపదను టన్నుల కొద్దీ ట్రాక్టర్లలో దర్జాగా తరలిస్తున్నారు. చెక్‌పోస్టులు దాటి కలప దర్జాగా తరలిపోతున్నా.. అడిగే నాథుడు లేడు. మండలంలో రెండు చోట్ల అటవీ, వ్యవసాయ శాఖ తనిఖీ కేంద్రాలు ఉన్నా అక్కడి సిబ్బందికి అక్రమార్కులు మామూళ్లు ఇచ్చి మేనేజ్‌ చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్రమార్కులకు అండగా కొందరు అధికారులు

మనకు సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో కలపకు విపరీతమైన డిమాండ్‌ ఉంది. కర్మాగారాలు, సామిల్లులు అధికంగా ఉండడంతో ధరలు కూడా అధికంగా ఉంటాయి. అక్కడ కలప రకాన్ని బట్టి దాదాపు టన్నుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో సరిహద్దు రాష్ట్రానికి అత్యంత చేరువలో ఉన్న యాదమరి మండలంలోని గ్రామాల సమీపంలో ఉన్న అడవులపై కన్నేస్తున్నారు. సులభంగా కలప తరలించేందుకు వ్యాపారులు కొంతమంది అవినీతి అధికారులకు తాయిలాలు ఎర వేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రతి నెలా దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ముడుపులు అందుతున్నాయనే మాటలు మండలంలో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. అయితే పచ్చని పొలాల గట్లపై ఉన్న చెట్లను నరికి తరలించే క్రమంలో పక్కనే ఉన్న అడవిలో ఏపుగా పెరిగిన విలువైన వృక్ష సంపదపై స్మగ్లర్ల కన్నుపడే ప్రమాదం పొంచి ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఫారెస్టు అధికారులు కొందరు.. కలప స్మగ్లర్లతో చేతులు కలిపి బాగానే వెనుకేసుకుంటున్నారని పర్యావరణ ప్రేమికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం కలప అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంచామని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి అధికారులపై, అనుమతులు లేకుండా చెట్లు నరికి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పర్యావరణ హితులు కోరుతున్నారు. కాగా ఈ విషయంపై అటవీ శాఖ అధికారులను ఫోన్లో సంప్రదించగా.. నంబరు అందుబాటులో లేదనే సమాధానం వస్తోంది.

చర్యలు తీసుకుంటాం..



ఇప్పటివరకు ఈ విషయం మా దృష్టికి రాలేదు. అటవీశాఖను సమన్వయం చేసుకుని కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. మా సిబ్బందితో గట్టి నిఘా ఉంచుతాం. మండలంలోని గ్రామాల్లో రైతులు ప్రభుత్వ అనుమతి లేకుండా కలపను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

– పార్థసారథి, తహసీల్దార్‌, యాదమరి

సీఆర్పీకి ఘన వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న సీఆర్‌పీ ధనంజయను సత్కరిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: మండలంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ధనంజయను ఎంఈఓ హేమలత ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తొడతర సీఆర్‌పీగా ధనంజయ 13 ఏళ్లుగా పని చేశారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో గంగవరం మండలానికి బదిలీ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ధనుంజయను ఎంఈఓ హేమలత ఆధ్వర్యంలో సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది శాలువ కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

భక్తిశ్రద్ధలతో కావళ్లు చెల్లింపు



సుబ్రహ్మణ్య స్వామికి కావళ్లు చెల్లిస్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యం స్వామి దేవస్థానంలో శనివారం భక్తులు భరణి కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అర్చకులు శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. ఆలయం అంతా హరోహర నామస్మరణతో మార్మోగింది. తవణంపల్లె, పరిసర గ్రామాల్లోని భక్తులు స్వామికి భరణి కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

క్లస్టర్‌ సమావేశాల పర్యవేక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న ఎంఈఓ ప్రసాద్‌

యాదమరి: మండలంలోని ఉపాధ్యాయులకు జరిగిన క్లస్టర్‌ సమావేశాలను మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్‌ పర్యవేక్షించారు. శనివారం మండల పరిధిలోని కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈఓ ప్రసాద్‌ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాఠ్యాంశాల బోధనపై నూతన ఒరవడిపై వివరించారు. విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా ఎలా బోధించాలో వివరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తగ్గకుండా చూడాలని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దేలా ప్రతి ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం ప్రభుత్వం వినూత్నంగా అందించిన హ్యాండ్‌బుక్‌లను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకాచారి, మదన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలతో మానవాళికి హాని



గుడిపాల: మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శిరీష

గుడిపాల: సమాజంలో పర్యావరణానికి ఈ–వ్యర్థాలు తీవ్రంగా హాని చేస్తున్నాయని, వాటిని వినియోగించడమే మానవాళి మనుగడకు రక్ష అని ఎంపీడీఓ శిరీషా తెలిపారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఈ–వ్యర్థాలు, ప్లాస్టిక్‌ వాడకం నిషేధంపై వసంతాపురంలో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ సమాజంలో పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్‌ ఉపకరణాల వ్యర్థాలను పూర్తిస్థాయిలో పునశుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆమె మహిళా సభ్యులకు సూచించారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా చేసి చెత్త బండి వాహనాల్లో వేయాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కృష్ణప్రసాద్‌, కార్యదర్శి సుందరేషన్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి



ఐసీడీఎస్‌ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వాడ గంగరాజు

చిత్తూరు కలెక్టరేట్‌: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఐసీడీఎస్‌ పీడీ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకులు నాణ్యమైనవి ఇవ్వకుండా కాంట్రాక్టర్లు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యకర్తల వద్ద ముందస్తుగా వేలిముద్రలు తీసుకుని రెండు, మూడు రోజుల తర్వాత సరుకులు సరఫరా చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వల్ల నాసిరకమైన సరుకులను గుర్తించలేకపోతున్నారని చెప్పారు. వాటిని తిరిగి కాంట్రాక్టర్లకు ఇస్తుంటే తీసుకోకుండా మీ వల్ల అయింది చేసుకోండి అనే ధోరణిలో బెదిరిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై పనిభారం తగ్గించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఫోన్లు పది సంవత్సరాలు దాటుతోందని, వాటిలో నెట్‌వర్క్‌ సమస్య వల్ల వివరాలు నమోదు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొత్త ఫోన్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న అన్ని సీడీపీఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



గుడిపాల: ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ హసన్‌బాషా

గుడిపాల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని మండల విద్యాశాఖాధికారులు హసన్‌బాషా, గణపతి తెలిపారు. శనివారం నరహరిపేట, బొమ్మసముద్రం, ఏఎల్‌పురం సీఆర్‌సీలో ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌ ద్వారా టీచర్లకు సబ్జెక్ట్‌ వైస్‌ టీవీల ద్వారా విద్యాబోధన గురించి వివరించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని వారికి సూచించారు.

అస్సాం మారణహోమాన్ని ఖండించండి



నిరసన తెలుపుతున్న నాయకులు

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): అస్సాం మారణహోమాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామమిని ఎస్‌డీపీఐ పార్టీ నాయకులు తెలిపారు. చిత్తూరు నగరంలోని దర్గా సర్కిల్‌లో వారు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అస్సాంలోని గోల్‌ పారా జిల్లాలోని బదియ పారా, బెట్బారి గ్రామాల్లో నివసిస్తున్న సుమారు వెయ్యికి పైగా కుటుంబాలపై అస్సాం ప్రభుత్వం ఆక్రమణదారులు, వలసదారులు అనే నెపంతో వారి స్థలాలను ఖాళీ చేయించాలని దౌర్జన్యానికి దిగిందని, ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా 60 మంది గాయపడడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వాలు 1982 నుంచి మైనార్టీలకు చట్టబద్ధంగా కేటాయించిన ఇళ్ల స్థలాలు, నేడు అక్రమం ఎలా అయిందో చెప్పాలన్నారు. ప్రపంచ కుబేరుల్లో అదానీ, అంబానీ ఆదాయం తగ్గినపుడు మోదీ, అమిత్‌ షా, నిర్మలా సీతారామన్‌ ఏకమై ఆదివాసీల సంపదను అడవులను ధారాదత్తం, రుణమాఫీ చేస్తున్నారని మండిపడ్డారు. బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కరీం, సైఫుల్లా, ఆరీఫ్‌, ఖాలిక్‌, గఫర్‌భాయ్‌, యూసుఫ్‌ భాయ్‌, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ కార్యాలయం మార్చవద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్‌(కాణిపాకం): ఏళ్ల తరబడి ప్రజలకు అందుబాటులో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ కార్యాలయాన్ని దూరంగా తరలించేందుకు తాము ఒప్పుకోమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శనివారం చిత్తూరు నగరం సంతపేటలోని శ్రీపురం సత్రం స్థలంలో నిర్మిస్తున్న నూతన కార్యాలయ భవనం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలమూలల నుంచి వచ్చే అర్జీదారులకు, ప్రజలకు అందుబాటులో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ కార్యాలయాన్ని ఓ అధికారి స్వలాభం కోసం ప్రజలకు దూరంగా ఏర్పాటు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇటు కుప్పం నుంచి అటు నగరి వరకు వారి సమస్యలను చెప్పుకునేందుకు ఎంతో వీలుగా ఉండే జీవ కారుణ్య అన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న కార్యాలయాన్ని తరలించాలని ప్రయత్నిస్తుండడం చాలా బాధాకరమన్నారు. సంతపేటలోని శ్రీపురం సత్రం స్థలంలో మొదట సత్రం పేరుతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారని.. ఇప్పుడు అందులోనే కార్యాలయం ఏర్పాటు చేయాలని ఓ అధికారి ప్రయత్నిస్తున్నారని, అందుకు తాము ఒప్పుకోమన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని.. ఎట్టి పరిస్థితుల్లో కార్యాలయాన్ని తరలించేందుకు ఒప్పుకోమని తేల్చి చెప్పారు. అధికారులు ఈ చర్యను మానుకోకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌కు వారు కార్యాలయాన్ని తరలించవద్దని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వీసీ గోపీనాథ్‌, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర



ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు



ప్లాస్టిక్‌ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఈఓ

చిత్తూరు కార్పొరేషన్‌: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో పీటీ రెడ్డెప్ప, జేఏఓ విద్యాసాగర్‌ పలువురు ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను తీసివేశారు. అదేవిధంగా వెస్ట్‌ ఎఫ్‌ఆర్వో కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాలను డీఆర్వో కరణ్‌సింగ్‌, ఎఫ్‌బీఓ ఎత్తివేశారు. అనంతరం ఎఫ్‌ఆర్వో పట్టాభి మొక్కలు నాటారు. ట్రాన్స్‌కో అర్బన్‌ డివిజన్‌ కార్యాలయంలో సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం ఈఈ మునిచంద్ర వారి చేత ప్రతిజ్ఞ చేయించారు.

కాణిపాకంలో


కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత అధికారులు సిబ్బందితో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆ తరువాత ర్యాలీగా దేవస్థానం అతిథి గృహం నుంచి బయలుదేరి ప్లాస్టిక్‌ కవర్లు, ప్లాస్టిక్‌ డిస్పోజబుల్‌ నియంత్రణపై ఈఓ పెంచల కిషోర్‌ వివరించారు. ప్లాస్టిక్‌ నిషేధంపై కఠిన ఆంక్షలు ఉంటాయని, బయో డిగ్రేడిబుల్‌ కవర్లను వాడాలని షాపులు, హోటల్‌ యజమానానికి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ధనంజయ, ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రసాద్‌, ధనపాల్‌, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ అంతరాయం ఉండదు

చిత్తూరు కార్పొరేషన్‌: చిత్తూరు డివిజన్‌లో ఆదివారం విద్యుత్‌ అంతరాయం ఉండదని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. 220 కేవీ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయం ఉంటుందని ముందుగా ప్రకటించామన్నారు. కానీ అనివార్య కారణాలతో మరమ్మతు పనులను వాయిదా వేశామన్నారు. దీంతో యథావిధిగా సరఫరా ఉంటుందని వినియోగదారులు గమనించాల్సిందిగా కోరారు.

తెప్పలపై జగదభిరాముడి విహారం

– భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజల్‌ సేవ



తెప్పల్లో ప్రత్యేక అలంకరణలో కొలువైన శ్రీరామచంద్రుడు



ఊయల సేవలో సేదతీరుతున్న సీతారామలక్ష్మణులు



కోదండరామాలయ పుష్కరిణిలో అలరారుతున్న తెప్పలు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పుష్కరిణిలో తెప్పోత్సవాలు భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామలక్ష్మణులకు ఉయ్యాల సేవ

ఆలయంలో శనివారం సాయంత్రం సీతారామలక్ష్మణులకు ఉభయదారులచే ఉయ్యాల సేవ ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, వస్త్రాలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తెప్పలపై అలరారుతున్న శ్రీరాముడు

కోదండరామాలయంలో రాత్రి తెప్పలపై శ్రీరాముడు విహరిస్తూ అలరారుతూ భక్తులకు కనువిందు చేశారు. ఉభయదారులు స్వామికి గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, పూజాసామగ్రి, వివిధ రకాల ప్రసాదాలు, పట్టువస్త్రాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులచే స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. తెప్పలను విద్యుద్దీపాలు, సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలతో అలంకరించారు. తెప్పలపై శ్రీరాముడు కొలువుదీరి అలరారుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వినాయక విద్యామందిర్‌ విద్యార్థులచే అద్భుతంగా ప్రదర్శించిన నాటికలు, నాట్యాలు, డ్యాన్స్‌లు భక్తులను ఆకట్టుకుంది. కోదండరాముల వార్షిక బ్రహ్మోత్సవాలను ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పి.సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు, గ్రామస్తులు, ఉభయదారులచే విజయవంతంగా నిర్వహించారు.